సంక్రాంతి సంబరాల సందడి



లక్కవరంలో భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా



భోగిమంట చుట్టూ నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



మ్యూజికల్ చైర్స్‌లో పాల్గొన్న మహిళలు

జంగారెడ్డిగూడెం రూరల్: తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా భోగి మంటలు వెలిగించి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని అన్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే పల్లెల్లో ఎంతో సందడి నెలకొంటుందన్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తమ సొంత గ్రామాల చేరుకుని పండుగను ఎంతో ఆనందంగా నిర్వహించుకుంటారని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. పండుగ రోజుల్లో యువత క్రికెట్, వాలీబాల్, తదితర క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గెల్లా వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. వేగవరంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు, ఉప సర్పంచ్ అనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసపురంలో వాసవీక్లబ్, కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అయితా వర ప్రసాద్, గుళ్లపూడి నిఖిల్, తోట లక్ష్మీపతి గుప్తా, గుళ్లపూడి శ్రీనివాసరావు, కాకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన పల్లెల్లో సంక్రాంతి సంబరాల సందడి

బుట్టాయగూడెం: గిరిపల్లెల్లో సంక్రాంతి సంబరాల సందడి నెలకొంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని మారుమూల గ్రామమైన పండుగూడెంలో శుక్రవారం కామయ్యకుంట సచివాలయం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పెడకం విజయలక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. భోగిమంటలు వేసి సంక్రాంతి పాటలు పాడుతూ భోగిమంటల చుట్టూ నృత్యాలు చేశారు. ఈ కబడ్డీ పోటీల్లో సర్పంచ్‌లు విజయలక్ష్మితోపాటు రాజానగరం సర్పంచ్ కుంజా దుర్గమ్మ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కామవరం, రెడ్డిగణపవరంలో సంక్రాంతి ఆటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు.



కొయ్యలగూడెంలో గ్రామ దేవత చింతాలమ్మ ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం చింతాలమ్మ ఆలయం వద్ద

కొయ్యలగూడెం: సంక్రాంతి సంబరాలు నేపథ్యంలో కొయ్యలగూడెంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ముగ్గుల పోటీలు, సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత చింతాలమ్మ ఆలయం వద్ద రైతు అభ్యుదయ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దోజు శ్రీనివాసచార్యులు పాల్గొన్న ప్రతి ఒక్కరితోపాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. తూర్పుపేట రామాలయంవద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథులుగా హాజరైన తాడికొండ మురళీకృష్ణ, మేకల అన్నవరం, మట్ట లక్ష్మీపతి, సర్పంచ్ ముప్పిడి విజయకుమారిల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాన్నా రామచంద్రరావు, రాచూరి మదన్, ముప్పిడి చినబాబు, కొల్లూరి నగేష్ మడుతూరి శ్రీను పాల్గొన్నారు.



పండుగూడెంలో కబడ్డీ ఆడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి



వేగవరంలో రంగవల్లుల పోటీ



శ్రీనివాసపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సచివాలయ పరిధిలో గల దిబ్బగూడెంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితురాలు రాములమ్మకు శుక్రవారం ఆదివాసీ కొండరెడ్ల సంఘం రాష్ట్ర సలహాదారు నడపల సోమరాజు, ఆయన కుమార్తె నడపల అనూషల చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా చీరలు, లుంగీలు, దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చెయ్యడం జరిగింది. మూర్ల ఇంద్రజ, గ్రామ యూత్ అశోక్, రమేష్, చిలకమ్మ పాల్గొన్నారు.

కోడిపందేలకు బరులు సిద్ధం



రింగు రోడ్డు గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి

కొయ్యలగూడెం: సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేల నిర్వహణకు బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు కోడిపందేలను అడ్డుకుంటామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని కోడిపందేల బరులకు ప్రఖ్యాతిగాంచిన రింగు రోడ్డు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో బరులను రాత్రికి రాత్రే ఆగమేఘాల మీద సిద్ధం చేస్తున్నారు. పండుగ మూడు రోజులు పందేల నిర్వహణ కొనసాగుతాయనే ధీమా నిర్వాహకులు వ్యక్తం చేస్తున్నారు.

నూకాలమ్మ ఆలయానికి రూ.25,116 విరాళం



దాత గుంటముక్కల శేఖర్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ వారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మనోజ్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. రాజాన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుంటముక్కల సాయిబాబా జ్ఞాపకార్థం, ఆయన భార్య అరుణకుమారి, కుమారుడు నాగచంద్రశేఖర్ బాబు, లతారాణి కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళంగా అందజేసినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను సత్కరించి, అమ్మ వారి శేష వస్త్రాన్ని, చిత్ర పటాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



గుణ్ణంపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్లో తాళ్ల పృధ్వీరెడ్డి ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 8 టీంలు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా ట్రోఫీతో పాటు రూ. 10 వేలు నగదు, ద్వితీయ బహుమతిగా ట్రోఫీని, మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతులు మీదుగా శనివారం అందజేస్తామని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంప్రదాయ క్రీడల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు ముల్లంగి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నీలకంఠేశ్వరరెడ్డి, అనూష్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచు పరదా



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంపై శుక్రవారం మంచు పరదా కమ్మేసింది. ఉదయం 9 గంటలు దాటినా మంచు వీడలేదు. దాంతో ఆలయ పరిసరాలు, రహదారులు సరిగా కనిపించక వివిధ వాహనాలపై క్షేత్రానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల లైట్ల వెలుగులో ప్రయాణాలు సాగించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో భోగి వేడుకలు

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి పండుగ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, అప్ ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ప్రతినిధి ముదునూరి నరసింహరాజు అన్నారు. అప్ లాండ్ క్షత్రియ సేవా సమితి, అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ ఏరియా వ్యాయామ, ఆరోగ్య అభిలాషుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం భోగి వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అప్ ల్యాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు గోరింట విజయ రామరాజు, సిటీ బ్యాంక్ అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు భోగి మంటలు వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఆనందోత్సాహాలతో భోగి మంట చుట్టూ నృత్యం చేశారు. మహిళలు మ్యుజికల్ చైర్స్ ఆడారు. క్రీడాభివృద్ధికి అప్ ల్యాండ్ క్షత్రియ సేవా సమితి చేస్తున్న కృషి వివరించారు. వ్యాయామ, క్రీడలను ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా సహకరిస్తున్న నరసింహరాజు, రంగరాజు, గోరింట విజయ రామరాజు, అట్లూరి రామరాజును వాకర్స్, వ్యాయామ, ఆరోగ్య అభిలాషులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దందు ధనరాజు, ఐకార్ మెంబర్ అర్జుల మురళీ కృష్ణ, ఐ.జే.యు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ, వ్యాయామ శిక్షకుడు అట్లూరి రామరాజు, ఔత్సాహిక వ్యాయామ అభిలాషులు కొప్పిశెట్టి వెంకట సూరిబాబు, గుబ్బల వెంకటసత్య ప్రసాద్, విజ్జు శంకర్, రామకృష్ణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు శ్రీవారి క్షేత్రం ముస్తాబు



శ్రీవారి క్షేత్రంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న దృశ్యం

ద్వారకాతిరుమల: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా.. శ్రీవారి క్షేత్రంలో సంక్రాంతి సంబరాలను జరిపేందుకు ఆలయ అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు శ్రీవారి కొండపైన తూర్పు ప్రాంతాన్ని సిబ్బంది శుక్రవారం ముస్తాబు చేశారు. పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ఏవిధంగా జరుగుతాయో కళ్లకు కట్టినట్లుగా చూపేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా భోగి మంటలు వేసేందుకు కట్టెలను సిద్ధం చేశారు. ఆ ప్రాంతాన్ని రంగు రంగుల రంగవల్లులతో సిబ్బంది తీర్చిదిద్దారు. అలాగే పూరి గుడిసెలు, ఎడ్ల బళ్లు, సంక్రాంతి విశిష్టతను తెలిపే చిత్రమాలికలు, రంగవల్లుల్లో గొబ్బెమ్మలు, చెరుకు గెడలను ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు ఏర్పాట్లను పరిశీలించారు. భోగి పండుగను పురస్కరించుకుని శనివారం ఉదయం ఇక్కడ జరుగనున్న సంబరాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈఓ కోరారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్ప క్షేత్రంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం పర్వదినం సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం అయ్యప్ప స్వామి క్షేత్రంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సేవలందించారు.

ఈనెల 15న మకర జ్యోతి దర్శనం

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఈనెల 14న భోగి పండుగ సందర్భంగా చిన్నారులకు భోగి పళ్లు పోసే కార్యక్రమం, 15న సంక్రాంతి పర్వదినాన జ్యోతి దర్శనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఆరోజు సాయంత్రం 6:41 గంటలకు జ్యోతి దర్శనం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1985-86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

లింగపాలెం: ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 38 సంవత్సరాల క్రితం చదువుకున్న 1985-86 టెన్త్ బ్యాచ్ శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాలతో ఉల్లాసంగా గడిపారు. అనంతనం ఆలనాటి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలకు రూ.20 వేల విలువ కల్గిన కుర్చీలు, టేబుళ్లు అందజేశారు. ఈకార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు మందలపు వేణు, కె శివరఘవరాజు, కె.వీ సుబ్బారావు, మట్టా రమేష్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు గోదా కల్యాణం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మా ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈనెల 14వ తేదీ భోగి పండుగ సందర్భంగా గోదా కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. 14వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల నుంచి గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎండీ ఉమర్ ఆలీకి సన్మానం



ఎండీ ఉమర్‌ఆలీని సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సంఘ సేవకులు ఎండీ ఉమర్‌ఆలీని శుక్రవారం బిలాల్ మసీదు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఏలూరులో ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయన్ను సన్మానించినట్లు బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ జిలాని తెలిపారు. పేదలకు, వితంతువులకు, అనాథలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఏలూరు గౌతమ బుద్ధా ట్రస్ట్ నుంచి ఈ అవార్డును అందుకున్నట్టు ఉమర్‌ఆలీ తెలిపారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీని దుశ్శాలువాతో మసీదు కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్‌సభ్యులు షేక్ లాల్ అహ్మద్, మదీనా మసీదు అధ్యక్షుడు షాజహాన్, ఇలియాజ్, ముస్తాక్ అహ్మద్, పర్వేజ్ అహ్మద్, మియాసా, ముస్లిం నాయకులు రబ్బానీ, బషీర్, దాదా సాహెబ్, పేష్ ఇమాం హైదర్ ఆలీ రిజ్వీ, బాజాన్, షేక్ హజరత్ పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల తీరుతో రైతులకు ఇక్కట్లు

లింగపాలెం: ధాన్యం అమ్మకాలలో రైస్ మిల్లర్లు, రైతులను దోపిడీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటివరప్రసాద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రసాద్ సొసైటీలో విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దళారీ వ్యవస్థకు అడ్డుకట్టవేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఎటువంటి మోసాలకు గురికాకుండా సొసైటీల ఆధ్వర్యంలో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. కొంత మంది మిల్లర్ల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరువస్తోందని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు నూక శాతం, తేమ శాతం అధికంగా ఉంటోందని రకరకాల కారణాలు చెబుతూ ఒకొక్క లారీకి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు రైతుల వద్ద నుంచి వసూళ్లు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మిల్లర్లు చెప్పిన విధంగా రైతులు డబ్బులు చెల్లించకపోతే ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా రిజెక్ట్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కలరాయునగూడెం రైతుభరోసా కేంద్రం నుంచి సొసైటీ ద్వారా రెండు రోజుల క్రితం ధాన్యం తీసుకెళ్లిన లారీ నూక శాతం ఎక్కువగా ఉందని రూ.20 వేలు ఇవ్వాలని లేకపోతే ధాన్యాన్ని దిగుమతి చేసుకోమంటూ మిల్లరు రైతులను ఇబ్బంది పెట్టారని ప్రసాద్ అన్నారు. 1318 రకం ధాన్యాన్ని దించకుండా నిలుపుదల చేశారని, 500 బస్తాలు లారీలో ఉన్నాయని ఒకొక్క బస్తాకి రూ.40 చెల్లించాలని మిల్లర్ డిమాండ్ చేస్తున్నాడని ప్రసాద్ తెలిపారు. ధాన్యం లారీకి లోడు చేసి పంపించి మిల్లులో దిగుమతి అయ్యేంతవరకు మిల్లర్లు ఏవంక పెడతారోనని రైతులు గుండె చేతపట్టుకొని బిక్కుబిక్కు మంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని ప్రసాద్ కోరారు.

కోడికత్తులతో వ్యక్తి అరెస్టు

చింతలపూడి: చింతలపూడి మండలం డీఎస్‌రావు పేట గ్రామంలో కోడికత్తులు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై డి హరికృష్ణ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన పుప్పాల శ్రీను వద్ద 20 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాటర్ ట్యాంకరుకు మరమ్మతులు



పరింపూడిలో వాటర్ ట్యాంకరును ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ వాటర్ ట్యాంకరుకు దాతల సహకారంతో మరమ్మతులు చేయించారు. శుక్రవారం సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి ఆధ్వర్యంలో ట్యాంకరును పంచాయతీకి దాతలు అందజేశారు. దివంగత మాటూరి పంచాక్షరి, ముత్యం దంపతుల జ్ఞాపకార్థం రూ.1.50 లక్షలతో వాటర్ ట్యాంకరును గతంలో పరిపూడి పంచాయతీ గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం బహూకరించారు. ఆ ట్యాంకర్ మరమ్మతులకు గురి కావడంతో నిరుపయోగంగా మారింది. దీంతో విషయం తెలుసుకున్న దాతలు స్పందించి ట్యాంకర్‌కు మరమ్మతులు చేయించి అందజేశారు. మాటూరు సుధీర్, వార్డు సభ్యులు మలిశెట్టి కేసు బాబు ,రాచూరి మదన్ పాల్గొన్నారు.